# సన్మానం

చెయ్యని నేరానికి శిక్ష అనుభవించి, శిక్షానంతరం జైల్లోనుంచీ బయట పడినవాడి మనసెలా వుంటుందో చెప్పగలరా? అది అనుభవైకవేద్యం.

ఆనాటి సాయంకాలం ఒకానొక సభలో నుంచీ ఈవలికి వచ్చేటప్పటికి నాకు కలిగిన అనుభూతి అలాంటిదే! బాహాటంగా లెంపలు వేసుకోక పోవడమొకటే కొదవ. ఏకోశాన్నయినా బుద్ధి అనేది వుంటే భవిష్యత్తులో యిట్టి పనికి పాల్పడగూడదని నాలోనేను చాలాసార్లు అనుకున్నాను. ఇంతకూ ఆ సభ సంగతేమిటో చెప్పలేదుగదూ! అదొక సన్మాన సభ. చెబుతే నమ్మరేమో, ఆ సన్మానం జరిగింది నాకే!

'లలితకళాసమితి' అనే పేరు తమరు వినేవుంటారు. ఇంచుమించు అదే పేరుతో ప్రతి పట్టణంలోనూ ఒక సంస్థ వుంటుంది. ఎందుకుంటుందని అడక్కండి! గాలి ఎందుకు వీస్తుంది? నీరెందుకు ప్రవహిస్తుంది? కొన్ని కొన్ని సంఘాలందుకే వుంటాయి. చెప్పొచ్చిందేమిటంటే రంగరాజపురంలో అలాంటి కళాసమితి ఒకటుంది. ప్రతి సంవత్సరమూ వార్షికోత్సవంనాడు ఒక కవిని 'యథోచితంగా సత్కరించడం వాళ్ళు ఆదినుంచీ పాటిస్తూ వస్తున్న సాంప్రదాయమట! 'ఈసారి వంతు మీదే'నంటూ వాళ్ళు నాకొక ఉత్తరం రాసి పోస్టు చేశారు. వాళ్ళ అభిమానానికి ఉప్పొంగి పోయనప్పటికీ నేను నా అశక్తతను గూడా గుర్తించనవాడినై 'అయ్యో! మీరేమిటో పొరపాటుపడినట్టున్నారు, నేను కవినిగాను, ఛందస్సురాదు. కేవలం వచనం మాత్రమే రాస్తాను, దయచేసి మీ కార్యార్థం నిజమైన కవి నెవరి నైనా చూచుకోండి' అంటూ నా ఆంతర్యాన్ని ప్రత్యుత్తరం ద్వారా తెల్పుకున్నాను. కానీ అదంతా కుదరదని వాళ్లు నిక్కచ్చిగా తేల్చి చెప్పేశారు. 'అబ్బే. మీరలా అనగూడదు సార్! మా సంకల్పం తిరుగులేనిదని మీరు గుర్తించాలి. మా వూరికి వందమైళ్ళ పరిధిలో వున్న కవుల్ని మేము ఖాళీ చేసేశాము. వ్యాసార్ధాన్ని కొంచెం హెచ్చించినందువల్ల మీరు మాకు దొరికిపోయారు. మిమ్మల్ని వదిలే ప్రసక్తిలేదు, మీరు రాకాతప్పదు. మా సన్మానాన్ని స్వీకరించకా తప్పదు' అంటూ వాళ్లు నన్ను ఒకటే మొగమాట పెట్టేశారు. ఇక గత్యంతరం లేక రెండు మూడు బస్సులు మారి ఒక పగలంతా ప్రయాణంచేసి సభ జరిగే సమయానికి నేనా వూరు చేరుకున్నాను.

చనిపోయినవాడు గాయకుడని తెలిసేటప్పటికి వాడి శవాన్ని బాగా లోతుగా పాతిపెట్టండి, అన్నాడటగదండీ ఔరంగజేబు! మన సమాజంలో కళాకారుల స్థితిగతులు అంతకంటే మెరుగ్గా లేవేమోనని నా అనుమానం. ఉదరపోషణకోసం ఏ వృత్తినో, ఉద్యోగాన్నో ఆశ్రయించి అదొక ఉబలాటంగా కళకోసం పరిశ్రమించే వాళ్ళే ఎక్కువ. కానీ రంగరాజపురంలోని పరిస్థితులు నా ఊహకు విరుద్ధంగా వున్నట్టు తోచింది. కాకపోతే ఒక కళాసమితి వార్షికోత్సవానికి బ్రహ్మాండమయిన షామియానాలా? పది పన్నెండు కార్లా? అత్యంత ఆధునికమైన ఆసన సదుపాయాలా? వెదురుగడలన్నింటికీ విద్యుద్దీపాలా?

ఈ రంగరాజపురం కళాకారులెవరో గానీ, వీళ్లు బాగా జరుగుబాటుగలవాళ్ళయి వున్నారు - అనుకున్నాను.

అంతటి గొప్ప సభలో సన్మానాన్ని అందుకోబోతున్నానన్న భావం నాలో ఎనలేని ఉత్తేజాన్ని చేకూర్చింది. కాలరు సవరించుకున్నాను, క్రాపింగు సర్దుకున్నాను. దుమ్మూ ధూళీ పోయేటట్టుగా ముఖాన్ని అరచేతితో రుద్దుకున్నాను. కానీ, ఏదీ! నన్ను ఎవరూ పలకరించరే!

అంతలోనే నా పొరబాటు నాకు తెలిసొచ్చింది. తొందరపాటుకు నొచ్చుకున్నాను. కొండలుదాటి పల్లెలూ పేటలూదాటి నా కీర్తి అయితే యింతదూరం ప్రాకి వచ్చేసిందిగానీ, నా మూర్తి వాళ్ళకేంతెలుసు? పలకరించాలంటే నేనెవరినో తెలియాలిగదా! అందుకని నన్ను నేను పరిచయం చేసుకోడం అప్పట్లో నా విద్యుక్త ధర్మమని గ్రహించాను.

సీట్లన్నీ నిండిపోవడంవల్ల పందిరిచుట్టూ అర్ధ చంద్రాకారంగా నిల్చున్న జనంలోనుంచీ చొచ్చుకుని వెళ్ళి కుర్చీల పద్మవ్యూహాన్ని గూడా దాటి,గుంపుగా నిల్చున్న కార్యకర్తల దగ్గరికి వెళ్ళగలిగాను. ప్రముఖులు, దిగ్గంతులు, హేమా హేమీలు అంటూ తెలుగుభాషలో కొన్ని మాటలున్నాయి గదండీ! వాటిని సార్థకం చేస్తున్న ఆకారాలతో, వేషాలతో, హావభావాలతో ముందు వరుసలో కూర్చున్న పెద్దలతో కార్యకర్తలందరూ ఒక్కుమ్మడిగా సంభాషిస్తున్నారు. అందరిలోనూ కొంచెం సౌమ్యుడుగా కనిపించిన ఓ కార్యకర్తను సమీపించి 'అయ్యా! నేను ఫలానావాణ్ణి ఇంతకుముందే బస్సుదిగాను. నేరుగా సభకే వచ్చేశాను' అని తెలియపరచుకున్నాను.

ఆ కార్యకర్త నావైపు అయోమయంగా ఎగాదిగా చూచాడు. ఆ చూపువల్ల నా వాలకం అతడికట్టే రుచించలేదని నాకు బోధపడింది. 'అలాగా! కవిగారు మీరేనా?' అన్నాడు. అనుమానమూ, నిరుత్సాహమూ సమపాళ్ళలో కలసివున్న ఆమాటలు నన్ను క్రుంగదీశాయి.

కవికీ, రచయితకూవున్న తేడా ఏమిటో ఆ కార్యకర్తకు వివరించేపాటి ఓపిక నాకప్పుడు లేదు. ఎక్కడో ఒకచోట కొంచెం కవిత్వం కూడా వెలిగించి వుంటారు కనుక రచయితను కవి అనుకున్నా కొంప మునిగేదేమీ లేదు. ఎటొచ్చీ 'కవిగారు మీరేనా?' అనటం దగ్గరే చిక్కు. 'నాయనా! ఈ శరీరం నాది గావడంలో నా ప్రమేయమేమీ లేదు. ఇక దుస్తులంటావా? అవసరాన్ని గడుపుకోవడానికని తప్పితే అదొక హంగుగా ముస్తాబు చేసుకునే ఆర్థిక స్తోమత నాకులేదు' అని నోరువిడిచి చెప్పుకోడానికీ మనస్కరించలేదు. ఇలాంటి విపత్కర పరస్థితి ఎదురైనప్పుడు ఒక గెజిటెడ్ ఆఫీసరుచేత అటెస్టు చేయించుకున్న స్వంత ఛాయచిత్రం ఒకటి జేబులో వుంటే ఎంత బాగుండేదని నాకప్పుడనిపించింది.

తుది నిర్ణయం తీసుకోడం ఆ కార్యకర్తకు యిష్టంలేదల్లే వుంది. టీచరుతో చాడీ చెప్పదలచుకున్న బడి కుర్రాడిలా 'ఉండండి. సెక్రెటరీగారితో చెబుతాను', అంటూ వెళ్ళి ఇంకొక ఆసామిని నా వైపుకు తోలుకొచ్చేశాడు.

సెక్రెటరీ కాబోలు, పొడుగ్గా జుబ్బా తొడుక్కుని, పట్టుదుప్పటం ఒకటి వల్లెవాటుగా వేసుకొని, కళ్ళద్దాలు తొడుక్కుని అసలు సిసలు బెంగాల్ బాబల్లే వున్నాడు.

"ఏమండీ! ఇప్పుడొస్తున్నారా? మీకు మా ఇన్విటేషన్ చేరలేదేమిటి?"

ఇన్విటేషన్ చేరలేదనీ, ఉత్తరాలు మాత్రం అందాయనీ చెప్పుకున్నాను. నా మాటలు నాకే క్షమాపణలాగా ధ్వనించాయి.

అంతటితో నా అవకతవక ప్రవర్తనంతా క్షమించేస్తున్నట్టుగా అతడు 'నర్సింహం! కవిగారికో ఇన్విటేషనివ్వు' అని పురమాయించి 'మీరు కూచోండి సార్! పదినిమిషాల్లో కార్యక్రమం ప్రారంభమవుతుంది'

అంటూ వేదికపైకి వెళ్ళిపోయాడు.

చీరకుతగ్గ పీటలా ఇన్విటేషను గూడా ఆ సభకు తగ్గట్టే అమిరిందని చెప్పాలి. ఎం.ఎల్.ఏ.లు మున్సిపల్ చేర్మన్లు మొదలైన వాళ్ళు రాజకీయాల్లోనే వుండాలనుకోడం పొరపాటనీ, వాళ్ళప్పుడప్పుడూ కళారాధనకు గూడా పూనుకోవచ్చునని నేనా ఆహ్వానపత్రం ద్వారా గ్రహించాను. సభకు అధ్యక్షత వహిస్తున్నది శ్రావణం కనకయ్య. ఎం.ఎల్.ఏ. గారు. ముఖ్య అతిధిగా విచ్చేసింది కొప్పుల సుబ్బారావు మునిసిపల్ చేర్మనుగారు, బహుమతి ప్రదానం గావించేది కె.డి.యస్ మూర్తి, మెంబరు, ఎ.ఐ.ఎఫ్.ఎస్.సి. న్యూఢిల్లీ గారు. కళాసమితి ఆవరణలో అంగళ్ళకోసం కట్టిన కొత్త గదులకు ప్రారంభోత్సవం గావించడం కోసం విచ్చేసినవారు డి.ఆర్. గూటాల, ఎం.ఎస్; ఆర్.ఎం.ఓ. పూనాగారు. 'గారు' అనే గౌరవవాచకం కొన్నిచోట్ల ఆయా వ్యక్తుల్ని వరించిన పదవులకు, మరికొన్నిచోట్ల ఆ వ్యక్తులు నివసిస్తున్న పెద్ద పట్నాలకు జోడించివుండడం యిందులో గమనించదగ్గ విశేషం. ఉచితజ్ఞులైన కార్యనిర్వాహకులు నేను చేసే ఉద్యోగం గానీ, నివసించే ఊరుగానీ అంత ఘనమైనవేమీ కాదని యిట్టే తేల్చేశారు. ఇన్విటేషనులో నా పేరు లేకపోలేదు గానీ, దానికోసం నేను చాలాసేపు వెదుక్కోవలసి వచ్చింది.

సెక్రెటరీ గారన్నట్టుగా పది నిమిషాల్లోనే సభ ప్రారంభమైపోయింది. ప్రారంభమైన సభ కొనసాగింది. ముగిసింది. కానీ ఎట్లా జరిగిందని చెప్పవలసి వస్తే అదంతా పెద్ద కథ. ప్రేక్షకుల్లో ఎక్కువమంది సభానంతరం జరిగే నాటక ప్రదర్శన కోసం వచ్చినవాళ్ళు. నాలుగ్గంటలకల్లా మేకప్పు పూర్తి చేసుకుని నటీనటులు గ్రీన్ రూములో వుండిపోతున్నారు. ఆ ప్రేక్షకులకున్నూ, ఈ నటీ నటులకున్నూ నడుమ ఉపన్యాసకులు అదేపనిగా ఊకదంపుడు మొదలెట్టేశారు. గట్టిగింజ ఒకటి వుంటే ఒట్టు. ఒక్క 'కళ'ను గురించి తప్పితే మిగిలిన సర్వ విషయాలపైన వాళ్ళ ప్రసంగాలు దొర్లిపోయాయి. 'నేను నిన్ను పొగడినంత మేరకు నువ్వు నన్ను పొగడాలి' అంటూ ఒక లోపాయికారీ ఒప్పందం వాళ్ళ మధ్య కుదిరిందేమోనని సభికులు అనుమానించే పరిస్థితి ఏర్పడింది. పలానా విషయాన్ని గురించి మాట్లాడాలన్న అభిప్రాయమేమీ లేకపోవడంవల్ల వాళ్ళ భావాలు అదుపు తప్పిన రాకెట్లలా, వాక్యాలు బ్రేకుల్లేని బస్సుల్లా ప్రేక్షకుల అవగాహనతో కుస్తీ పట్టసాగాయి. వేదిక నలంకరించిన పెద్దలు సభలో చెలరేగుతున్న ఆలజడిని కూడా గొప్ప అప్రీసియేషన్‌గా భావించడంతో సభ రసాభాసమైపోయే పరిణామం కూడా నాలుగైదుసార్లు పొడసూపింది.

చల్లకొచ్చి ముంత దాచుకోడమెందుకు? ముఖ్యంగా చెప్పవలసింది ఆ సభలో నాకు జరిగిన సన్మానం గురించిగదా! ఆ విషయంలోకే వస్తున్నాను. సన్మాన చిత్రహింసకు ప్రధానంగా గురైంది నా పేరు. ఎన్నడూ విన్నది కాదేమో! దాన్ని ఒక్కొక్కరూ ఒక్కొక్క విధంగా ఉచ్ఛరించారు. మాటవరసకు నా పేరు గంగవరం శంకరయ్య అనుకోండి. ఒకాయన శంకవరం గంగరయ్య అన్నారు. ఇంకొకాయన వరిశంకం కంకరయ్య అన్నారు. ఇంకొకాయన శంకర్రాం గంగారాం అన్నారు. (బహుశా ఆయన పూనావారై వుండాలి) జరాసంధుణ్ణి భీమసేనుడు కూడా అంత నిర్దాక్షిణ్యంగా చీల్చి పారవేసి వుండడు. అన్నట్టు సభికులకు నన్ను పరిచయం చేస్తూ, సెక్రెటరీబాబు చేసిన ప్రసంగం వుందే, అది నా సన్మానానికల్లా హైలైటు. 'అయ్యా! చూచారా!' అంటూ ఆయన గొంతు సవరించుకున్నాడు....... "ఈయన, గువ్వపిట్టలా ఈ కుర్చీలో ఒదిగి కూర్చున్న ఈయన,ఎవ్వరో ఎరుగుదురా? ప్రసిద్ధ కవీశ్వరుడు. మీరు పోతన్న, మల్లన్న, ఎర్రన్న. తిక్కన్న మొదలైన పేర్లు వినేవుంటారు. అలాంటి వాడన్నమాట! కానీ ఏం లాభం? మారుమూల కుగ్రామంలో ఈయన ఒక బడిపంతులుగా అఘోరిస్తున్నాడంటే అదెంత సిగ్గుచేటో నేను చెప్పలేను (?) ఇటువంటి వాళ్ళని బహిరంగానికి తెచ్చి గౌరవించడం మనధర్మం. దుశ్శాలువతోను,

నూట పదార్లతోను వీరిని సన్మానించవలసిందిగా అధ్యక్షులవారిని ప్రార్థిస్తున్నాను".

పూలదండ వేస్తుండగా ఒకటి, శాలువా కప్పుతుండగా ఒకటి పళ్ళెం చేతికిస్తుండగా ఒకటి, ఆ ఫొటోల తతంగం మాత్రం ఎంతో నింపాదిగా జరిగింది. వార్షికోత్సవాల ప్రయోజన మంతా పత్రికల్లో ఫొటో పడడమే అయినప్పుడు, ఆపనిపైన నిర్వాహకులు ప్రత్యేక శ్రద్ధ వహించడంలో ఆశ్చర్యమేముంది? పత్రికల వాళ్ళు ఎట్లాగైనా రచయితలకు సగోత్రికులు, ఎవరికో ఒక రచయితకు ఎక్కడైనా సన్మానం జరిగిందంటే వాళ్ళకు పరమానందం.

సదరు సన్మాన వస్త్రాన్నీ, ద్రవ్యాన్నీ గూడా సంచీలో వుంచుకుని యింకా మనిషి ముఖం మనిషికి కనిపించని మసకచీకట్లో మరునాటి ఉదయం నేను బస్సెక్కేశాను. రాత్రంతా వేడుకలతో గడిచిందేమో వెచ్చని బస్సులో గాఢంగా నిద్రపట్టింది. తొమ్మిదింటికి కళ్ళు తెరిచేసరికి కనిపించిన వూరు రాయచోటి. అక్కడ బస్సుమారాలి. దిగేటప్పటికి ఎక్కవలసిన బస్సు స్టాండులోనే ఉంది. ఎక్కి కూర్చున్నాను. టిఫిన్ చేయలేదన్న విషయం అప్పుడు జ్ఞప్తికి వచ్చింది. బస్సు బయల్దేరడానికి గూడా యింకా వ్యవధి వున్నట్టు ఎవరో అన్నారు. కానీ రాజకీయల్లో లాగే బస్సుల్లో గూడా సీటు జారిపోతే మళ్ళీ దొరకడం కష్టం. ప్రక్కనే కూర్చున్న అబ్బాయితో సంచీ జాగ్రత్తగా చూచుకోమని చెప్పి, దిగి హోటల్లోకి వెళ్లాను.

పదినిమిషాల్లో తిరిగి వెళ్ళేసరికి రెండు సీట్లూ ఖాళీగా వున్నాయి.

"బాబ్బాబూ! నా బ్యాగేమైంది?" అంటూ గొంతుచించుకున్నాను.

"ఇందాకా అక్కడ కూచున్న అబ్బాయి ఎత్తుకు దిగేశాడే! అది మీబ్యాగా? అరరే, ఇట్టే బోల్తాకొట్టించేశాడే! పరుగెత్తండి సార్! వెళ్ళి చూడండి, వెదికి పట్టండి"

ప్రయాణీకుల సానుభూతికి ఇంధనంకాలేక బస్సులో నుంచీ దిగేశాను. హఠాత్పరిణామం తాకిడికి బుద్ధి మొద్దుబారిపోయింది. ఏంచేయాలో తోచడంలేదు. ఏదైనా చేయాలన్న ఉద్దేశమూ లేదు. సంచీ తీసుకెళ్ళిపోయిన వాడెవడోగానీ, వాడాపనిలో సిద్ధహస్తుడై వుంటాడు. నాకు 'డిటెక్షన్'లో ఓనమాలైనారావు, రోడ్డుపైన నిల్చుని అరిస్తే పదిమంది దృష్టినీ ఆకర్షించవచ్చు. కానీ అందువల్ల ఒరిగేదేముంది?

క్రితంరోజు సాయంకాలం కళాసమితి వాళ్ళిచ్చినవేగాక, నా దుస్తులు కొన్ని సంచిలో వుండిపోయాయి. చేతి ఖర్చులకని తెచ్చుకున్న డబ్బుగూడా అందులోనే భద్రపరిచాను. గుప్పెడు చిల్లర డబ్బులు తప్పితే, నేనిప్పుడు రిక్తహస్తుణ్ణి. బస్ ఛార్జీలకన్నా డబ్బు పుట్టించుకుంటే గానీ స్వగ్రామం చేరలేను. ఏదిదారి?

బస్ స్టాండునుంచీ ట్రంకురోడ్డు దాకా నడిచాను. తెలిసిన ముఖమేదైనా కనిపిస్తుందేమోనని కాలేజి కాంపౌండులో ప్రవేశించాను. నా అదృష్టంకొద్దీ ఆ రోజు కాలేజికి సెలవు. చేసేదిలేక ఓ రావిచెట్టు నీడలో రాతిబెంచీపైన కూలబడ్డాను. దూరాన పిల్లలు కొందరు క్రికెట్టు ఆడుకుంటున్నారు. రోడ్డుపైన వాహనాలు సందడి చేస్తూ పరుగెడుతున్నాయి. కొమ్మలపైన పక్షులు కిచకిచలాడుతున్నాయి. ప్రపంచానికి సంబంధించినంతవరకూ అంతా బాగానేవుంది. ఒక వ్యక్తి నిస్సహాయతను గురించి ఎవరికి కాబట్టింది? అక్కడే మధ్యాహ్నమైపోయింది. నాకు జ్ఞానోదయం మట్టుకూ కాలేదు.

నా పొరబాటేమిటో నాకప్పుడు తెలిసింది. ఇలా ఒక ఏకాంత ప్రదేశంలో గోళ్లు గిల్లుకుంటూ కూచోడంకంటే నేనా బస్‌స్టాండులోనే వుండి వుంటే బాగుండిపోయేది. అదైతే నాలుగువైపుల నుంచీ మనుషులొచ్చి దిగేచోటు. ఉంటే గింటే పరిచితులెవరైనా నా కంటబడే అవకాశం అక్కడే వుంటుంది....

చెట్టుచేమల పచ్చనిపట్లు బహు సక్సత్తై పోవడంవల్ల తెలుగుదేశంలో కొన్ని పట్టణాలు ఎడారిలో

వేసుకున్న గుడారాల్లా వుంటాయి. అలాంటి వాటిలో రాయచోటి ఒకటి. బస్‌స్టాండు బూడిద దుమ్ములో కొంతసేపు తిరిగేసరికి నేను బాగా దస్సిపోయాను. వేసుకున్న దుస్తులు మట్టిగొట్టుకపోయాయి. కాళ్లు పీకడం మొదలట్టాయి. బొగ్గు వెయ్యకపోతే మానె, నీళ్ళయినా పొయ్యకపోతే ఇంజను దారిదప్పే ప్రమాదం ఏర్పడినట్టు తోచింది. దగ్గర్లోవున్న ఓ కొట్టులోకి వెళ్ళి కడుపునిండుకూసోడానీళ్ళు పట్టించాను. కొట్టు ముంగిట వున్న పందిరిగుంజ కానుకొని అప్పుడిక చేయవలసిందేమిటో ఆలోచించసాగాను.

పరిసరాలను సర్వే చేస్తున్న శూన్య దృక్కులకు ఏ దృశ్యం కనిపించిందో మరి, ఉన్నట్టుండి నేను ఉలికిపడిపోయాను. గమనించి చూచాక బోధపడింది. బక్కపలచటివాడు. ఫుల్ యూనిఫాంలో వున్నాడు. వయసు పాతికేళ్ళకన్నా ఎక్కువ వుండవేమో! ఎవరోగాని చాకులాంటి పోలీసు. కన్నార్పకుండా నావైపే చూస్తున్నాడు.

కంగారు పడిపోతూ నేను నావైపొకసారి చూచుకున్నాను. నా వేషమూ, వైఖరీ గూడా అనుమానించడానికి తగ్గట్టే వున్నాయి.

అపాయాన్ని శంకించిన ఉష్ట్రపక్షిలా పెడముఖం పెట్టుకొని నిల్చోడమొకటే నా కప్పుడు గత్యంతరమై పోయింది. ముళ్ళపైన పాదాలు మోపినట్టుగా ఆ భంగిమలో కొద్ది నిమిషాలు మాత్రమే నిల్చుని వుంటాను. పొంచి పొంచీ ఒక నీడ నాకు దగ్గిరగా వస్తున్నట్టు తోచింది. ఒక దశలో తలపైన పెట్టుకున్న టోపీ గూడా నీడలో స్పష్టంగా కనిపించింది; వచ్చి వచ్చి అతడు నా ఎట్టఎదుట నిలబడిపోయాడు "ఏమండీ! ఏవూరు మీది? ఏ బస్సుకోసం వెయిట్ చేస్తున్నారు?"అన్నాడు.

ఆఖరుక్షణంలో నాలో మొండి తెగువ చోటుచేసుకుంది. "బస్సుకోసం గాదు. బస్సు టికెట్టుకు డబ్బు పుట్టించుకునే ఉపాయం కోసం వెయిట్ చేస్తున్నాను" అన్నాను.

వెంటనే అతడు మరొక ప్రశ్నను నాపైకి సంధించాడు. "మీ పేరేమిటి?"

పేరేమిటో చెప్పుకోగానే తన అనుమానం నివృత్తి అయినట్టు అతడు తటాలున నా చేతిని పట్టుకున్నాడు. 'రండి' అంటూ ముందుకు లాక్కెళ్ళసాగాడు.

అతడు నన్నలా ఈడ్చుకుంటూ వెళ్తున్న దృశ్యాన్ని చూచి ఎందరెందరు ఎన్నెన్ని విధాలుగా వ్యాఖ్యానించుకున్నారో నాకు తెలియదు.

అయితే ఒక విషయంలో నా అంచనా తల్లక్రిందులైంది. నన్నతడు తీసుకెళ్ళి దిగబెట్టే చోటు పోలీస్‌స్టేషనేనని నే ననుకున్నాను. కాదు. అదొక హోటలు.

"భోజనంవేళ దాటిపోయింది. టిఫిను తీసుకోండి" అని నాకు పురమాయించి, "ఇదిగో అబ్బాయ్! వేడిగా ఏముంది?" అంటూ అతడు వెయిటరువైపు తిరిగాడు.

అత్యవసరంగా కావల్సినదాన్ని వద్దని చెప్పడానికి నోరు పెగలిందిగాదు.

ఇంతకూ ఈ పోలీసెవడు? ఇతడు నన్ననుమానించాడా? జాలిపడ్డాడా? ఈ అయాచిత సత్కారానికి కారణమేమిటి? ఇదంతా నా పాలిటి కప్పుడు బొత్తిగా అనవసరమైన విచికిత్సగా తోచింది. తక్షణ కర్తవ్యం ఉపాహారంపైన విరుచుక పడడమేననిపించింది.

కాఫీగూడా సేవించాక భౌతికంగా నేను చాలావరకు కోలుకోగలిగాను. మాట్లాడే వోపిక సమకూరింది. "చూడుబాబూ! నువ్వెవరివో నాకు తెలియదు. పొడిగా 'థేంక్స్' అని ఒకమాట చెప్పడం చప్పగా వుంటుంది. నీకెలా కృతజ్ఞత చెప్పుకోవాలో తెలియడంలేదు" అన్నాను.

అతడు నవ్వాడు. "మేష్టరుగారూ! నేనెవరినో తెలిసే అవకాశం మీకు లేదు. కానీ నాకు మిమ్మల్ని గురించి తెలుసు. ప్రస్తుతం మీరెలాంటి పరిస్థితిలో వున్నారో, అదీ తెలుసు . మీరు

రంగరాజపురం వెళ్తొస్తున్నారు. నిన్నటి సాయంకాలం మీకక్కడ సన్మానం జరిగింది. ఈ రోజు ఉదయం యిదే బస్టాండ్లో మీరు మీ బ్యాగు పోగొట్టుకున్నారు....."

బుడుంగున నేను ఆశ్చర్యసాగరంలో మునిగిపోయాను. అందులోనుంచీ తేలి, తెవుదుకోక మునేపే అతడు మళ్లీ కొనసాగించాడు.

"దొంగవెధవ ఏం చేశాడో తెలుసాండీ? వస్తువులన్నీ కాజేసి మీసంచీ ఒకచోట పారేశాడు.. దాన్నెవరో స్టేషనుకు తీసుకొచ్చారు. అప్పుడు నేను డ్యూటీలో వున్నాను. వాడి తొందరలో వాడు లోపలి సరంజామానంతా తీసేశాడే గానీ, సంచీ సొరుగులో మీ నేమ్ కార్డు మాత్రం అట్లాగే వుండిపోయింది. ఈ వూళ్లో ఎవరెవరు. ఎక్కడెక్కడ, ఎప్పుడెప్పుడు ఎలాంటి చేతివాటు పనులు చేస్తారో నాకు తెలుసు. వెంటనే 'ఆపరేషన్' ప్రారంభించాను, అరగంట లోపల దొంగ దొరికి పోయాడు. నాలుగు వాయించేసరికి వస్తువులెక్కడ దాచిందీ చెప్పేశాడు. తెప్పించి చూద్దునుకదా; అందులో కళాసమితి వాళ్ళు మీకు రాసిన ఉత్తరాలున్నాయి. సభకోసం వేసిన ఆహ్వానపత్రం వుంది. కప్పిన శాలువాతో బాటు వాళ్ళు మీకిచ్చిన నగదుడబ్బు కూడా కనిపించింది. అప్పటినుంచీ నేను మీకోసం బస్‌స్టాండు ఏరియాలోనే బీటు వేసేశాను. ఏనాడో మీ ఫోటో ఒకటి చూచిన జ్ఞాపకం వుంది. కానీ అప్పటికీ యిప్పటికీ మీలో చాలా మార్పొచ్చింది...."

నేనతడి చేతులు రెండింటినీ నా చేతుల్లోకి తీసుకున్నాను. బహుశా ఆ క్షణంలో నా కంఠం గద్గదికమైపోయివుండాలి. "ఓ మాట చెప్పనా బాబూ! భగవంతుణ్ణి మార్గబంధువనీ ఆపద్బాంధవుడనీ చెబుతారు. మనిషిని గురించి అంతటి మాటలు చెప్పడం బాగుండదు. అయినా అలాంటి మాటలు మనసులో మెదిలి నప్పుడల్లా యికమీదట నువ్వు నాకు జ్ఞప్తికొస్తావు" అన్నాను.

అతడి ముఖం సిగ్గుతో కందిపోయింది. "మేష్టరుగారూ! మీరు నన్నంతగా గొప్పచేసి మాట్లాడడం న్యాయంగాదు. పదిహేనేళ్ళ క్రిందట నేనో కథ చదివాను, అందులో ఓ కుర్రాడు తల్లిదండ్రులమీద అలిగి యింట్లో నుంచీ పారిపోతాడు. పడరానిపాట్లుపడి, బుద్ధి తెచ్చుకుని మళ్ళీ తన వూరివైపు తిరుగుదారి పడతాడు, మార్గమధ్యంలో ఒక మర్రిచెట్టు, ఆ చెట్టు నీడలో అతడు సొమ్మసిల్లి పడిపోతాడు. కళ్ళు తెరిచేసరికి అతడితల తండ్రి ఒడిలో వుంటుంది. కొమ్మకు తగిలించిన సత్తుకారియర్ తీసి తండ్రి వాడికా మర్రాకుల్లోనే అన్నం పెడతాడు. తండ్రీ కొడుకులు ఒకరితో ఒకరు మాట్లాడుకోరు. మౌనంగానే ఒకరివెంట ఒకరు నడిచి పోతారు. ఆ కథను నేనెన్ని సార్లు చదివానో చెప్పలేను. అందులోని ప్రతివాక్యమూ నాకు కంఠోపాఠమే. అప్పటి నుంచీ నాకు మీ కథలంటే ఎంతో యిష్టం....."

సాగనంపడంకోసం అతడు మళ్ళీ బస్‌స్టాండుకు వచ్చాడు. నేను బస్సెక్కి కూచున్నాను.

"ఉండండి మేష్టరుగారూ! ఈ బస్సు యిప్పుడిప్పుడే కదులదులెండి. ఆలోగా వచ్చేస్తాను" అంటూ అతడు తుర్రుపిట్టలా ఎటో మాయమైపోయాడు.

క్రమక్రమంగా బస్సు ప్యాంసెంజర్లతో నిండిపోయింది. కండక్టరు టికెట్లు కొట్టడం ప్రారంభించాడు. డ్రయివరుగూడా తన సీటులోకి వచ్చి కూచున్నాడు. బస్సు కదలబోతుండగా ఏ సందులో నుంచో ఆ పోలీసబ్బాయి వడిసెల రాయిలా దూసుకొచ్చేశాడు. కిటికీలో నుంచీ ఓ పుస్తకం అందిస్తూ మేష్టరుగారూ! దయచేసి యిందులో సంతకం చేయండి" అన్నాడు.

అది కథల సంపుటి, 'మర్రిచెట్టు' కథ కూడా అందులో వుంది. సంతకం పెడుతుండగా కన్నీళ్ళు నా చూపుకు అడ్డుపడ్డాయి. పుస్తకాన్ని అందుకుంటూ వుండగా అతని కళ్ళల్లో గూడా

అశ్రుకణాలు దొర్లడం నేను గమనించాను.

బస్సు కదిలింది.

పుస్తకాన్ని అట్లాగే అరిచేతులమధ్య అదిమిపట్టుకుని అతడు చేతులు జోడించాడు.

బస్సు ముందుకు సాగబారింది. బస్సు ప్రయాణం నాకిప్పుడెంతో హాయిగా వుంది. రెక్కలొచ్చిన పక్షిలా నా మనసు ఏ ఆనంద లోకాలలోనో విహరిస్తోంది. కళాకారుడికి తన జీవితకాలంలో ఎప్పుడో ఒకప్పుడు, ఎక్కడో ఒకచోట నిజమైన సన్మానం జరిగి తీరుతుందని నాకు తెలిసొచ్చిన సమయం అది. రంగరాజపురంలో గాకపోతేనేమి, అది నాకు రాయచోటి బస్‌స్టాండులో జరిగింది.

*(ఆంధ్రసచిత్ర వారపత్రిక 1972)*